RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 111 Vol: 111 | మే 16 శనివారం 2026 May 16 Saturday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

ధరల పెంపు మోడీ వైఫల్యం 2

# ఇంధన మంట

## దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు: వాహనదారులపై భారీ భారం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** గత కొంతకాలంగా స్థిరంగా ఉన్న ఇంధన ధరలు దేశవ్యాప్తంగా ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరగడంతో, దేశీయ ఆయిల్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. దీని ప్రకారం లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెరిగాయి. ఈ పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. గత 11 వారాలుగా ధరలను స్థిరంగా ఉంచిన ప్రభుత్వ రంగ సంస్థలు, తీవ్ర ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ పెంపును అనివార్యం చేశాయి. 2022 ఏప్రిల్ నుంచి ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా, 2024 మార్చిలో ఎన్నికలకు ముందు లీటరుకు రూ.2 తగ్గించారు. అయితే తాజా పరిస్థితుల్లో కేంద్రం వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, కంపెనీలు ధరలు పెంచడం గమనార్హం. ఈ ధరల పెంపు ప్రభావం తెలుగు రాష్ట్రాలపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

➢ మిగతా 2వ పేజీలో..

# ఘోర రోడ్డు ప్రమాదాలు

**ఎనిమిది మంది దుర్మరణం**

**బెంగళూరు/చిత్తూరు జనసంఘర్షణ :** దక్షిణాది రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని కొప్పల జిల్లా మునీరాబాద్ సమీపంలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒక ఏడాది చిన్నారితో సహా ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. హులిగమ్మ దర్శనం ముగించుకుని 16 మందితో తిరిగి వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన ఒక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి నియంత్రణ కోల్పోయిన ట్రాక్టర్ బ్రిడ్జిపై నుండి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన పది మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతులంతా

➢ మిగతా 2వ పేజీలో..

# దేశ ప్రజలకు చల్లని కబురు

## మే 26నే కేరళకు నైరుతి రుతుపవనాలు



**న్యూఢిల్లీ గరుడధాత్రి:** దేశ వ్యవసాయ రంగానికి, ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటి నైరుతి రుతుపవనాల రాకపై భారత వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈ ఏడాది రుతుపవనాలు నిర్ణీత సమయం కంటే ఐదు రోజుల ముందే కేరళ తీరాన్ని తాకనున్నాయని ఐఎండీ శుక్రవారం వెల్లడించింది.

➢ మిగతా 2వ పేజీలో..

# యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీయే గేమ్ చేంజర్

**కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



**పుట్టపర్తి జనసంఘర్షణ** ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్ సాంకేతికత ఒక విప్లవాత్మక మార్పు (గేమ్ చేంజర్) అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో పుట్టపర్తి – కోడూరు రహదారిలోని 130 ఎకరాల విస్తీర్ణంలో ఈ డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, కేవలం రక్షణ రంగంలోనే కాకుండా ఆర్థిక, వ్యవసాయ రంగాల్లోనూ డ్రోన్లు నేడు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్

➢ మిగతా 2వ పేజీలో..

# 2034 వరకు నేనే సీఎం..

## ఆ తర్వాతే జాతీయ రాజకీయాల్లోకి: రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ జనసంఘర్షణ:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై మరోసారి అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2034 వరకు తెలంగాణలోనే ఉండి రాష్ట్ర ప్రజల కోసం పనిచేస్తానని, అప్పటి వరకు ముఖ్యమంత్రిగా తానే కొనసాగుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఒక మీడియా కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, తన రాజకీయ ప్రస్థానం, భవిష్యత్ వ్యూహాలను పంచుకున్నారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుని తర్వాతి తరానికి అవకాశం ఇస్తానని, ఆపై తన అనుభవాన్ని దేశం కోసం పంచుతూ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెడతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని, ఆ తర్వాత కేంద్రంలో ఆయన అప్పగించే బాధ్యతలను తీసుకుని, రాహుల్ తర్వాతి స్థానంలో జాతీయ రాజకీయాల్లో

➢ మిగతా 2వ పేజీలో..

# హైదరాబాద్ కేంద్రంగా హైస్పీడ్ రైలు కారిడార్

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ ఆదేశం**




**హైదరాబాద్ జనసంఘర్షణ:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను ఇతర ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన తుది ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్

➢ మిగతా 2వ పేజీలో..

# నీట్ రీ-ఎగ్జామ్ షెడ్యూల్ ఖరారు

**జూన్ 21న పరీక్ష నిర్వహణ**




**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో, రద్దయిన పరీక్షను తిరిగి నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 21న ఆదివారం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు ఎన్టీఏ

➢ మిగతా 2వ పేజీలో..

# జహీరాబాద్‌లో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

**భూమి పూజ చేసిన మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర**



**సంగారెడ్డి జనసంఘర్షణ :** 'తెలంగాణ రైజింగ్' లక్ష్యంలో భాగంగా రాష్ట్రాన్ని త్రీ ట్రిలియన్ ఎకానమీగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో రూ.650 కోట్ల భారీ పెట్టుబడితో, 44 ఎకరాల

➢ మిగతా 2వ పేజీలో..

# 2034 వరకు నేనే సీఎం..

**మొదటిపేజీ తరువాయి..** కొనసాగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం గీసిన గీతను తాను ఎప్పుడూ దాటనని, గాంధీ కుటుంబంతో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నదే రాహుల్ గాంధీ లక్ష్యమని, అయితే ఆయనకు వ్యక్తిగతంగా ప్రధాని కావాలనే కోరిక లేకపోయినప్పటికీ, ఆ పదవిని చేపట్టాలని తానే వికారాబాద్ సమావేశంలో చెప్పి ఒప్పించానని గుర్తుచేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీనే ఉంటారని, మొదట కాంగ్రెస్ తరఫున ప్రకటించి ఆ తర్వాత కూటమిలోని మిగతా భాగస్వామ్య పక్షాలను ఒప్పిస్తామని చెప్పారు. ప్రజల ముందుకు ఒక ఉమ్మడి పాలసీ డాక్యుమెంట్‌ను తీసుకెళ్లి తీర్పు కోరతామని, 2024 నుండి 2034 వరకు దేశ ప్రజలు కాంగ్రెస్‌కే అధికారం ఇస్తారని జోస్యం చెప్పారు. తెలంగాణ నుంచి దేశానికి పది శాతం జీడీపీ వాటా ఇచ్చేలా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

తన పాత రాజకీయ బంధాలను కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. గతంలో తాను తెలుగుదేశం పార్టీలో పదేళ్ల పాటు పనిచేశానని, పార్టీ మారే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబు నాయుడుకు స్వయంగా చెప్పి వచ్చానని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో పార్టీ వీడిన తర్వాత కూడా నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని, ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికీ తనను గౌరవిస్తారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ప్రజలు "స్విగ్గీ పాలిటిక్స్" కోరుకుంటున్నారని, వేగంగా ఫలితాలు ఇచ్చే నాయకత్వాన్ని ఆశిస్తున్నారని విశ్లేషించారు. ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ దూకుడును కొనసాగిస్తూనే, దేశ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తాజా వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

## జహీరాబాద్‌లో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

**మొదటిపేజీ తరువాయి..** విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న కేజేఎస్ (ఖజీూ) ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీకి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి కూడా పాల్గొన్నారు. స్థానికంగా ఉండే సుమారు 1,500 మంది మహిళలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తొగర్‌పల్లి ప్రాంతానికి ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి దంపతుల కృషే కారణమని కొనియాడారు. పూర్తిగా కాలుష్య రహితంగా నిర్మితమవుతున్న ఈ ఫుడ్ ఇండస్ట్రీ ద్వారా స్థానిక యువతకు, మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పుతామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సుల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలోనే పరిశ్రమల స్థాపనకు సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. శ్రీధర్‌బాబుకు పరిశ్రమల శాఖ పగ్గాలు అప్పగించడం చాలా సముచితంగా ఉందని, ఆయన చొరవతో వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావడం వల్ల స్థానికులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక మహిళలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఈ భారీ ప్రాజెక్టును జిల్లాకు తీసుకువచ్చామని, భవిష్యత్తులో సంగారెడ్డి ప్రాంతాన్ని మరిన్ని కేంద్ర పరిశ్రమలతో మరింతగా అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి**

**హైదరాబాద్, మే15 :** ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# ఇంధన మంట

**మొదటిపేజీ తరువాయి..** ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెరగగా, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున అదనపు భారం పడింది. ఇంధన ధరలతో పాటు సీఎన్‌జీ వినియోగదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిస్తూ కిలోపై రూ.2 పెంచాయి. ధరల పెంపు ప్రకటనకు ముందే వార్తలు బయటకు రావడంతో దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు, కొన్ని చోట్ల స్టాక్ లేదనే బోర్డులు కూడా దర్శనమిచ్చాయి. తాజా మార్పులతో దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.97.77కి చేరగా, ముంబైలో 106.68, కోల్‌కతాలో 108.74, చెన్నైలో 103.67గా నమోదైంది. డీజిల్ ధరలు కూడా ప్రధాన మెట్రో నగరాల్లో భారీగా మారాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి కారణం కావడంతో వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదాలు

**మొదటిపేజీ తరువాయి..** సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న కొప్పల, విజయనగర ఎస్పీలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పి.కొత్తకోట రైల్వే బ్రిడ్జి వద్ద జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఎనిమిది మంది ప్రయాణికులతో వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న మిగిలిన వారు తీవ్రంగా గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు తెలంగాణకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ రెండు ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు నమోదు చేసి, అతివేగం లేదా అజాగ్రత్త వంటి కారణాలపై సమగ్ర విచారణ జరుపుతున్నారు. ఈ ప్రమాదాలతో బాధితుల స్వగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీయే గేమ్ చేంజర్

**మొదటిపేజీ తరువాయి..** కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. రక్షణ రంగంలో భారత్‌ను సంపూర్ణ స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించగలిగామని, అందుకే నేడు రెండు రంగాలు చేయీ చేయీ కలిపి రక్షణ ఉత్పత్తుల్లో దూసుకుపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాను 'డ్రోన్ హబ్'గా తీర్చిదిద్దుతున్నామని, ఎనిమిది ప్రముఖ డ్రోన్ కంపెనీలు అక్కడ తమ యూనిట్లను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అలాగే హెచ్ఎఫ్‌సీఎల్ (ఎఖీజూ) సంస్థ రూ.1294 కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోందని, ఇవన్నీ ఆయుధ తయారీలో భారత్‌ను ప్రపంచ స్థాయికి చేరుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

గత పరిస్థితులతో పోలిస్తే భారతదేశ రక్షణ శక్తి గణనీయంగా పెరిగిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఒకప్పుడు రక్షణ పరికరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉన్న భారత్, ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చుకుందని తెలిపారు. 2004లో దేశీయ ఆయుధ పరికరాల తయారీ విలువ కేవలం రూ.46 వేల కోట్లుగా ఉండేదని, పదేళ్ల కఠోర శ్రమ ఫలితంగా ప్రస్తుతం అది రికార్డు స్థాయిలో రూ.1.75 లక్షల కోట్లకు చేరడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు కాగానే పెట్రో ధరలు పెంచారు

**మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం.. మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**

**హైదరాబాద్, మే15 :** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# దేశ ప్రజలకు చల్లని కబురు

**మొదటిపేజీ తరువాయి..** సాధారణంగా జూన్ 1వ తేదీన కేరళను పలకరించే రుతుపవనాలు, ఈసారి మే 26వ తేదీనే వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో కీలక పాత్ర పోషించే ఈ రుతుపవనాల ముందస్తు రాక రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. అయితే, రుతుపవనాల రాక సాఫీగా ఉన్నప్పటికీ ఎల్ నినో ప్రభావంపై వాతావరణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా ఎల్ నినో పరిస్థితులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని 'ఇన్‌కాయిస్' ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థంగా ఉన్న వాతావరణం, ఇప్పుడు ఎల్ నినోగా మారిందని, ఇది 2027 జనవరి వరకు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. రుతుపవనాల తొలి దశలో అంటే జూన్ నుండి జూలై వరకు వర్షపాతం నిలకడగా ఉన్నప్పటికీ, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఎల్ నినో బలపడి వర్షాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు జారీ అయ్యాయి.

## హైదరాబాద్ కేంద్రంగా హైస్పీడ్ రైలు కారిడార్

**మొదటిపేజీ తరువాయి..** వల్ల 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలో భాగంగా రాష్ట్రం ఒక కీలక ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందని సి.ఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. వేగవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రావడం వల్ల ఐటీ, పారిశ్రామిక, పర్యాటక రంగాలు మరింత పుంజుకుంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పురోగతిపై రైల్వే అధికారులు స్పందిస్తూ.. హైదరాబాద్-పూణే-ముంబై మార్గానికి సంబంధించి ఇప్పటికే డిపిఆం సిద్ధమైందని తెలిపారు. మొత్తం 671 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణలో దాదాపు 93 కిలోమీటర్ల మేర భూసేకరణ అవసరమవుతుందని అంచనా వేశారు. అలాగే హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కారిడార్ల కోసం మరో 123 కిలోమీటర్ల మేర భూసేకరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. కోకాపేట, శంషాబాద్ ప్రాంతాల్లో రైల్వే డిపోల నిర్మాణానికి స్థల సేకరణ అవసరమని అధికారులు ఈ సందర్భంగా సి.ఎస్ దృష్టికి తీసుకెళ్లారు. భూసేకరణ, మౌలిక వసతుల కల్పన విషయంలో రోడ్లు భవనాల శాఖ, హెచ్ఎండిఏ (నవీణూ), జిఎంఆర్ (+వీ=) ఎయిర్‌పోర్ట్ అధికారులు రైల్వే శాఖతో సమన్వయం చేసుకొని ప్రాజెక్టు విజయవంతానికి సహకరించాలని సి.ఎస్ రామకృష్ణారావు ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు కేంద్ర రైల్వే, విమానాశ్రయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నీట్ రీ-ఎగ్జామ్ షెడ్యూల్ ఖరారు

**మొదటిపేజీ తరువాయి..** తీసుకున్నారు. ఈ రీ-ఎగ్జామ్ కోసం విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేస్తూ, జూన్ 14న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వచ్చే ఏడాది నుంచి లీకేజీలకు తావులేకుండా నీట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సీబీఐ దర్యాప్తులో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వెలుగుచూసిన ఈ లీకేజీ మూలాలను ఛేదించే పనిలో పోలీసులు ఉన్నారని, విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల ఎంపిక కోసం విద్యార్థులకు వారం రోజుల పాటు గడువు ఇస్తున్నామని, పారదర్శకంగా పరీక్ష నిర్వహించడమే తమ ప్రాధాన్యతని మంత్రి వివరించారు.

# రాష్ట్ర ఆర్థిక సంఘం వేదికగా మున్సిపల్ చైర్‌పర్సన్ గళం

- ఇల్లందు ప్రగతికి 'ఆర్థిక' భరోసా
- పట్టుదలే ఆమె ఆయుధం





**ఇల్లందు మే 15 (జన సంఘర్షణ)**
ఇల్లందు మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించడంలో చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ తనదైన ముద్ర వేస్తున్నారు. కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ఆమె సాగిస్తున్న ప్రయాణం ఇప్పుడు రాష్ట్ర స్థాయి దృష్టిని ఆకర్షించింది. సూర్యాపేటలో జరిగిన 2వ రాష్ట్ర ఆర్థిక సంఘం సమావేశంలో ఆమె ప్రదర్శించిన చొరవ, ఇల్లందు పట్టణ భవిష్యత్తుపై ఆమెకున్న స్పష్టమైన విజన్‌ను చాటిచెప్పింది.

**ఎమ్మెల్యే మార్గదర్శకత్వం - చైర్‌పర్సన్ కార్యాచరణ**

స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య రాజకీయ అనుభవం, మార్గదర్శకత్వాన్ని పుణికిపుచ్చుకున్న కిరణ్ మిత్ర, పాలనలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణంలోని ప్రతి గల్లీలో ఉన్న సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆమె, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముందు వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సమన్వయమే ఇల్లందు అభివృద్ధికి అసలైన ఇంజిన్‌గా మారుతోంది.

**మౌలిక వసతులపై రాజీలేని పోరాటం**

సమావేశంలో ఆమె ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, అంతర్గత రహదారుల విస్తరణపై గళమెత్తారు. "నిధుల కొరత ప్రగతికి అడ్డుకాకూడదు" అన్న సంకల్పంతో, ఇల్లందు వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు ప్రత్యేక ప్యాకేజీ అవసరమని ఆమె గట్టిగా వినిపించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే తపన ఆమె మాటల్లో స్పష్టంగా కనిపించింది, ఇది ఒక బాధ్యతాయుతమైన నాయకురాలి లక్షణానికి నిదర్శనం.

**ఆర్థిక బలోపేతం దిశగా అడుగులు**

మున్సిపాలిటీలు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడకుండా, స్వయం సమృద్ధి సాధించాలనే ఆర్థిక సంఘం లక్ష్యానికి అనుగుణంగా ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. పట్టణ ఆదాయ వనరులను పెంచుతూనే, సామాన్యుడిపై భారం పడకుండా అభివృద్ధి పనులను ఎలా ముందుకు తీసుకెళ్లవచ్చో ఆమె వివరించిన తీరు అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. మహిళా నాయకత్వంలో ఇల్లందు మున్సిపాలిటీ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగుతోందని ఈ వేదిక స్పష్ట సాక్షిగా నిరూపితమైంది.

**ప్రజాక్షేత్రంలో నిరంతర శ్రామికురాలు**

పదవి అనేది అధికారం కాదు, అది ఒక బాధ్యత అని నమ్మే వ్యక్తిత్వం కిరణ్ మిత్రది. ఈ ఆర్థిక సంఘం సమావేశం ద్వారా ఆమె సాధించిన గుర్తింపు ఇల్లందు పట్టణానికి మరిన్ని నిధులు, తద్వారా మరిన్ని సౌకర్యాలు తీసుకువస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే కనకయ్య అండతో, కిరణ్ మిత్ర నాయకత్వంలో ఇల్లందు ఒక మోడల్ మున్సిపాలిటీగా మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఫీనిక్స్ ఇంటర్నేషనల్ గ్రూప్ అఫ్ స్కూల్ యాజమాన్యంపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్‌వో డిమాండ్

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):**
ఫీనిక్స్ స్కూల్ యాజమాన్యం విద్యా నియమావళిని ఉల్లంఘిస్తూ అనధికారికంగా పలు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నదని ఆరోపిస్తూ, వాటిపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎస్‌వో) హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించింది. ఏఐఎస్‌వో ఆరోపణల ప్రకారం, ఫీనిక్స్ స్కూల్ యాజమాన్యం హైదరాబాద్ జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు పత్రాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీలు, ఇతర తప్పనిసరి అనుమతులు లేకుండానే అనేక బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, నిర్మాణంలో ఉన్న భవనాల్లోనే విద్యార్థుల అడ్మిషన్లు నిర్వహిస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని, అక్కడ కనీస మౌలిక వసతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆటస్థలాలు, తాగునీటి సౌకర్యం, వెంటిలేషన్, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా లేవని ఏఐఎస్‌వో పేర్కొంది. ఇది విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే "ఇంటర్నేషనల్ స్కూల్" అనే పేరును ఎలాంటి అంతర్జాతీయ గుర్తింపు లేదా అధికారిక అనుమతి లేకుండానే ఉపయోగిస్తూ తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించింది. ఫీనిక్స్ స్కూల్ యాజమాన్యంపై ఏఐఎస్‌వో చేసిన ఇతర ఆరోపణలు ఇవి: తల్లిదండ్రుల నుండి అధిక నియంత్రణలేని ఫీజుల వసూళు. వివిధ పేర్లతో అనధికారిక చార్జీలు వసూలు చేయడం. అర్హతలేని, శిక్షణ లేని ఉపాధ్యాయులను నియమించడం. ఉపాధ్యాయులు, సిబ్బందికి తక్కువ వేతనాలు చెల్లించడం. ఆర్టీఈ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి ఉల్లంఘనలు. గుర్తింపు లేని తరగతులు, సెక్షన్లు నిర్వహించడం. ఈ నేపథ్యంలో అన్ని బ్రాంచ్‌లపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి భౌతిక తనిఖీలు నిర్వహించాలని, గుర్తింపు పత్రాలు, భద్రతా అనుమతులను పరిశీలించాలని, అనధికారిక క్యాంపస్‌లలో అడ్మిషన్లు, విద్యా కార్యకలాపాలను



తక్షణమే నిలిపివేయాలని ఏఐఎస్‌వో ప్రభుత్వాన్ని కోరింది. అలాగే అనుమతి పొందిన, అనధికారికంగా నడుస్తున్న స్కూల్ బ్రాంచ్‌ల జాబితాను ప్రజలకు వెల్లడించాలని, విద్యార్థులు తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేసింది. అనధికారిక విద్యాసంస్థల నిర్వహణ విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాలు, ప్రజల విశ్వాసానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఏఐఎస్‌వో డిమాండ్ చేసింది.

# ఎస్ఐఆర్ పేరుతో అక్రమంగా ఓట్లు తొలగించారు

- ఆందోళన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):**
కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓట్లను తొలగిస్తున్నారు అని బూతు లెవెల్ స్థాయిలో తనిఖీలు చేపట్టి ఓట్లపై నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే ఓట్లను తొలగిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఫతే నగర్ డివిజన్ లో 351 నుండి 366 నంబర్ బూతులలోని గౌతం నగర్, మాధవి నగర్, నాగార్జున కాలనీ, శోభన కాలనీ, పైప్ లైన్ రోడ్ లలో ఓట్లను తొలగించారని వివరించారు. సుమారు 40 వేల ఓట్లను తొలగించారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఆధారాలతో సహా జోనల్ కమిషనర్‌కు



ఫిర్యాదు చేసామని క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండా ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కేటీఆర్‌కు మూడు నెలల ముందు ఏసీబీ కోర్టు నోటీసులు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే కేటీఆర్‌ని తట్టుకోలేక నోటీసులు ఇచ్చారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసిన కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు భయపడరని అన్నారు. వారు ప్రజల తరఫున పోరాడుతారు. ప్రజా సమస్యలను వెలికి తీస్తారని అన్నారు. బడే బాయ్ చోటే బాయ్ ఒక్కటేనని మరోసారి తెలంగాణ ప్రజలకు అర్థమైందని రాబోయే ఎన్నికల్లో ప్రజలు రెండు పార్టీలకు గుణపాఠం చెప్తారు అనే భయంతోనే ఓట్లు తొలగిస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు.

# ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన బండి రమేష్

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):**
టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే ఇచ్చి శాలువాతో మంత్రిని రమేష్ సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్‌ని అభినందించారు. కార్పొరేషన్ ద్వారా వచ్చే నిధులను ఉపయోగించి పేద ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రికి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# సహకార సంఘాల్లో 'నామినేటెడ్' రాజకీయం

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే



**ఇల్లందు మే 15 (జన సంఘర్షణ)**
రైతు బాంధవులని చెప్పుకునే పాలకులు, క్షేత్రస్థాయిలో రైతు వెన్నెముకగా నిలిచే సహకార సంఘాల (పీఏసీఎస్, డీసీసీబీ) ఉనికిని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికలు నిర్వహించి రైతు ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య పద్ధతిని పక్కన పెట్టి, నామినేటెడ్ పద్ధతిలో తమ అనుచరులను గద్దెపై కూర్చోబెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమని సంఘం నేతలు మండిపడ్డారు. ఏఐకేఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం ఇల్లందు ఎమ్మార్వో కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించిన అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. సహకార రంగాన్ని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడం వల్ల నిజమైన రైతులకు అన్యాయం జరుగుతుందని, ఇది కేవలం అధికార పక్షం తన పట్టును నిలుపుకోవడానికి చేస్తున్న కుట్ర మాత్రమేనని విమర్శించారు. ఓటు హక్కు ద్వారా తమ నాయకుడిని ఎన్నుకునే హక్కును రైతులకు దూరం చేయడం అంటే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని రైతాంగ పక్షాన గళం విప్పారు.

# పెద్దమల్లారెడ్డిలో క్రికెట్ టోర్నమెంట్

**భిక్నూర్, మే 15 ( జన సంఘర్షణ )**
కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం పెద్దమల్లారెడ్డిలో యువత చెడు వ్యసనాలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. నిర్వహకులు మాట్లాడుతూ.. యువత క్రీడల వైపు మొగ్గుచూపేలా చేయడమే లక్ష్యమన్నారు. గ్రామ పెద్దలు క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి మంచివని తెలిపారు. టోర్నమెంటు గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు అవసరమైన సౌకర్యాలు కల్పించగా, యువత పెద్ద ఎత్తున పాల్గొనడంతో గ్రామంలో క్రీడా సందడి నెలకొంది.




# ఇస్సానగర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**బీబీపేట్, మే 15 ( జన సంఘర్షణ)**
కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం ఇస్సానగర్ గ్రామంలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు–అన్నదాతల అవగాహన' నిర్వహించారు. బీజేఆర్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.వెంకట్రామ్, టీచింగ్ అసోసియేట్ డా. రాషద్ ఖాన్ రైతులకు తక్కువ యూరియా వినియోగం, సమగ్ర పురుగు నియంత్రణ, పంట మార్పిడి, ధ్రువీకరించిన విత్తనాల వినియోగంపై అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు.



# అష్టముఖి కోనేరు వద్ద పూర్తయిన ఏర్పాట్లు నేడు భక్తుల పుణ్యస్నానాలు

**ఎడపల్లి, మే 15:జన ( సంఘర్షణ)**





ఎడపల్లి మండలంలో జానకంపేట్లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పరిధిలో గల అష్టముఖి పుష్కరిణి వద్ద నేడు శనివారం అమావాస్య సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు పవిత్ర స్నానాల కోసం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అష్టముఖి పుష్కరిణిలో స్నానం చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే గ్రహదోషాలు తొలగి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో తాగునీరు, మజ్జిగ, చలువ పందిళ్లు, క్యూలైన్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు, వాహన పార్కింగ్ తదితర సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి. విజయ రామారావు ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆలయ ఈవో గిజపల్లి వేణు, ప్రధాన అర్చకులు కొండాచార్యులు, సిబ్బంది రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రస్థానంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్

**నిజామాబాద్ /మే 15/(జన సంఘర్షణ)**
యాసంగి 2026 సీజన్‌లో సంబంధించిన వరి ధాన్యం సేకరణలో నిజాంబాద్ జిల్లా రాష్ట్రం అగ్రగామిగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 5.68 లక్షల మెట్రిక్ టన్నుల పై చిలుకు వరి ధాన్యం సేకరణ పూర్తి చేస్తామని వివరించారు. కేవలం ఐదు శాతం మేరకే మిగిలి ఉన్న మరో 32,797 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం అతివేగంగా వారం వారం రోజుల్లోపు కొనుగోలు పూర్తి చేస్తామని ప్రణాళికబద్ధంగా వివరిస్తానని చెప్పడం జరిగింది.



జన సంఘర్షణ
శనివారం
16 మే 2026

## వే టు న్యూస్ కాంక్లేవ్‌లో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత






నిజామాబాద్/మే 15/(జన సంఘర్షణ)

ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలి. ఉద్యమ కేసీఆర్‌తో సమస్య లేదు, ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోనే సమస్య. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ అంశంలో మా అమ్మ కుటుంబం నుంచి సరైన సపోర్ట్ రాలేదు. అంతర్గతంగా నేను చెప్పిన అభిప్రాయాలను బయటపెట్టి నన్ను బయటకు బయటకు వెళ్లేలా చేశారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన సరే తెలంగాణ రక్షణ సేనదే అధికారం. తెలంగాణ ప్రజలకు మర్చిపోలేనంత మంచి చేశానని చరిత్రలో నా పేరు ఉండాలన్నదే నా కోరిక. చేదు అనుభవాలు, కఠిన పరిస్థితులు చూశాకే నాలో మార్పు వచ్చింది. రాష్ట్రంలో గుణాత్మక మార్పు తెచ్చేందుకే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశాం. నా జీవితంలో ఎన్నో చేదు అనుభవాలు, కఠిన పరిస్థితులు చూశాక నాలో చాలా మార్పు వచ్చింది. ఎవరికీ నచ్చకపోయినా సరే మనకు నచ్చింది చేయాలన్నది నేను గుర్తించాను. కేసీఆర్ చాలా గొప్ప మనిషి. ఇందులో నాకు ఎలాంటి వేరే అభిప్రాయం లేదు. రాదనుకున్న రాష్ట్రాన్ని ఆయన సాధించి పెట్టారు.

ఉద్యమ కేసీఆర్‌తో నాకు ఎలాంటి సమస్య లేదు. ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినాయకుడు కేసీఆర్‌తోనే నాతో పాటు చాలా మందికి సమస్య వచ్చింది. బీఆర్ఎస్‌లో చాలా ఢిపరెంట్‌గా వ్యూ చెప్పేది నేనే ఉండే. ఇంటర్నల్‌గా నా అభిప్రాయాలు ఎప్పుడు చెబుతుండేది నేను ఇంటర్నల్ గా చెప్పిన అభిప్రాయాన్ని బయటకు వచ్చేలా చేశారు. దాంతో ఇంకా నేను నా అభిప్రాయానికి బయటకు చెప్పాల్సిన పరిస్థితి తెచ్చారు. ఇక అప్పటి నుంచి నేను ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని అనుకొనే పార్టీ పెట్టాను. చుక్క రక్తం చిందించకుండా రాజ్యాంగం ద్వారా దేశంలో మార్పు తెస్తానని అంబేద్కర్ అన్నారు. అదే విధంగా నేను కూడా రాజకీయ పార్టీ ద్వారా మంచి మార్పు తేవాలని వచ్చాను. కచ్చితంగా నన్ను ప్రజలు దీవిస్తారు, ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉంది. రాజకీయాల్లో కచ్చితంగా వ్యూహాలు ఉండాలి. నేను కేసీఆర్ వద్దే వ్యూహాలు నేర్చుకున్నాను. ఆడపిల్లలు రాజకీయాల్లో వచ్చి ఫెయిల్ అయితే వారికి ఏమీ చేతకాదని ముద్ర వేస్తారు. అందుకే కచ్చితంగా సక్సెస్ కావాలని నేను మంచి స్ట్రాటజిస్‌తో ముందుకు వెళ్తున్నా. మన రాష్ట్ర మహిళలు, భారత మహిళ బరువు నా మీద ఉంది. నేను సక్సెస్ అయితే వాళ్లు ఇంకా ధైర్యంగా రాజకీయాల్లోకి వస్తారు. నేను ఏ సమస్య వచ్చిన సరే పాజిటివ్ గానే ఆలోచిస్తాను. ఆడపిల్లలు డిప్రెస్ కావద్దు. మన దేశంలో 80 శాతం మంది 30 వేల లోపే సంపాదిస్తున్నారు. అందులో కూడా 70 శాతం విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. వారి వద్ద సేవింగ్స్ అనేవే ఉండటం లేదు. అందుకే ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అనేది ప్రైవేట్‌లో అయిన సరే ఫ్రీ గా ఇవ్వాలి. రాష్ట్రంలో గుణాత్మకమైన మార్పు తేవాలన్న బలమైన సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సమితి పెట్టాం. గత ప్రభుత్వం గానీ ఈ ప్రభుత్వం గానీ రైతులకు ఏమాత్రం మంచి చేయటం లేదు. వాళ్లు ధరణి అంటే వీళ్లు భూమాత అంటున్నారు. నేమ్ మారినా గేమ్ మాత్రం మారలేదు. వ్యవసాయం రంగంలో చాలా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదే విధంగా యువతకు ఉద్యోగాలు ఇవ్వటం మాత్రమే కాదు, వారిని ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి తేవాలి. అందుకే మేము మన యువతను నమ్మి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు వారికి రుణాలు ఇస్తాం. వారి వ్యాపారాలు పెట్టేలా ప్రోత్సహిస్తాం. వారిలో నుంచి ఒక్క గూగుల్ లాంటి సంస్థ వచ్చిన చాలు. సోషల్ జస్టిస్ అంటే కులాలకు మాత్రమే కాదు, సమాజంలో అవకాశాలు పొందలేని అన్ని వర్గాలకు మేలు చేయటం. వికలాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ ఆర్మీ జవాన్లు, సీనియర్ సిటిజన్స్ ఇలా అన్ని వర్గాలకు మంచి చేయటమే సోషల్ జస్టిస్.

అదే విధంగా అన్ని కులాల వారి, ఆడబిడ్డలకు రాజకీయంగా ఎదిగేందుకు మంచి అవకాశాలు కల్పించాలి. జెన్ జీ అంటే ఈ కొత్త తరాన్ని మెప్పించటానికి రాజకీయ నాయకులు చాలా కష్టపడాల్సి ఉంటుంది. వాళ్లు తలుచుకుంటే ప్రభుత్వాన్ని పడేయగలరన్నది నేపాల్ లో చూశాం. ఐతే జెన్ జీ కి మనం డాక్టర్లు, ఇంజనీర్లు అని కాకుండా రాజకీయాలు, సామాజిక అవగాహన కూడా చేయించాలి. మేము రాజకీయంగా ఏం చేసిన సరే అందులో మా కోర్ బిలీఫ్ ఉంటుంది. మా పార్టీ వరకు వచ్చే సరికి మా కోర్ బిలీఫ్ తెలంగాణయే. మేము ఏం పనిచేసిన సరే అంతర్లీనంగా తెలంగాణ ప్రయోజనాలుంటాయి. అయితే రాజకీయ నాయకులు ఏం చేసిన సరే వాళ్లు కరెప్ట్ అన్నట్లు మీడియా చూపిస్తుంది కానీ ఫండమెంటల్ గా ఏ నాయకుడు కరెప్ట్ ఉండరు. ఫ్యామిలీ జీవితాన్ని త్యాగం చేసి ప్రజల కోసం నిలబడే వ్యక్తులే రాజకీయ నాయకులు. ఈ దేశంలో ఏ పెద్ద మార్పు వచ్చిన సరే అది రాజకీయ పార్టీల కృషి కారణంగానే వచ్చింది. ప్రజాస్వామికంగా మనం అభిప్రాయాలు చెప్పే పరిస్థితి ఉండాలి. భిన్నమైన అభిప్రాయాలను తీసుకోవాలి.

కానీ దురదృష్టవశాత్తు ఈ దేశంలో ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది. ముందుగా ప్రాంతీయ వాదం తర్వాత జాతీయ వాదం ఉండాలని నేను కోరుకుంటా. అదే విధంగా జెన్ జీ, మహిళలు కూడా పాలిటిక్స్ లోకి రావాలని కోరుతున్నా. తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్ల కోసం అన్నది అందరికీ తెలిసిందే కానీ ఇప్పటికీ కూడా మనకు నీళ్ల విషయంలో అన్యాయం జరుగుతూనే ఉంది. బీఆర్ఎస్ లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేస్తే...కాంగ్రెస్ ఇప్పటి వరకు 30 వేల కోట్లు ఖర్చు చేసింది కానీ తెలంగాణలో కొత్తగా 15 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు.

ఆంధ్రాలో రాజకీయ నాయకులు మాత్రం వాళ్ల ప్రజల నీళ్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. తెలంగాణ రాకముందు కన్నా కూడా వాళ్లు ఇప్పుడే నీళ్లు ఎక్కువగా వాడుకుంటున్నారు. నీళ్ల విషయంలో తెలంగాణ ప్రజలను ఇక్కడి రాజకీయ నాయకులు ఫెయిల్ చేశారు. మనం పెట్టిన ఖర్చుకు వచ్చిన నీళ్లకు సంబంధమే లేకుండా ఉంది. తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ పాలమూరులో వలసలు ఆగలేదు. గత ప్రభుత్వంలో ఏమీ జరగలేదని నేను అనటం లేదు. కానీ మనం వాడుకోవాల్సిన నీళ్లను కూడా పూర్తిగా వాడుకోలేదు. గోదావరిలో 960 టీఎంసీలు వాడుకునే అవకాశం ఉంటే... 250 టీఎంసీలు కూడా మనం వాడుకోలేదు. 30 నెలల్లో పూర్తి చేయాల్సిన పాలమూరు ప్రాజెక్ట్ ను 132 నెలలైనా చేయటం లేదు. 32 వేల కోట్ల రూపాయల అంచనాలు కాస్త ఇప్పుడు 85 వేల కోట్ల రూపాయలకు చేరాయి.

పైగా పదేళ్లు నీళ్లు ఇవ్వకపోవటంతో రైతులకు రావాల్సిన రెండున్నర లక్షల కోట్లు ఆదాయం వారికి రాకుండా పోయింది. ఇప్పటికి కూడా గోదావరి నుంచి 4 వేల టీఎంసీ లు సముద్రంలో కలుస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగిన సరే తెలంగాణ రక్షణ సేననే అధికారంలోకి వస్తుంది. మేము అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం. పాలిటిక్స్ లో ఇవ్వాళ ఉన్న పరిస్థితి రేపు ఉండదు. అప్పటి వరకు బలమైన నేతగా ఉన్న వ్యక్తులు కూడా ఒక్క సంఘటనతో డ్యామేజ్ అవుతారు. బీజేపీ లో బండి సంజయ్ బలమైన నేతగా ఉండేవారు. కానీ వాళ్ల కుమారుడి మీద వచ్చిన ఆరోపణలతో ఒక్కసారిగా పరిస్థితి ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు. బండి సంజయ్ కుమారుడి మీద వచ్చిన ఆరోపణలపై రేవంత్ రెడ్డి ఎలా వ్యవహరిస్తున్నారో తెలంగాణ మహిళలు గమనిస్తున్నారు. నాన్ బెయిల్ సెక్షన్లు ఉన్న కేసుల్లో కూడా అరెస్ట్ చేయకుండా బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి మేలు చేసి పెడుతున్నాడు. కచ్చితంగా ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. అవసరమైనప్పుడు కచ్చితంగా తెలంగాణ మహిళలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారు. ఇవ్వాళ్టికి కూడా తెలంగాణలో రోజుకు మహిళపై 7 రేప్ కేసులు నమోదవుతున్నాయి. బండి సంజయ్ కుమారుడి వ్యవహారంలో ఆమె క్యారెక్టర్‌ను తప్పు పట్టేలా మీడియాలో కథనాలు వేస్తున్నారు. మీడియా ట్రయల్ ద్వారా మహిళలకు నష్టం జరుగుతోంది. ఇటువంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఎంకరేజ్ చేయవద్దు. తన కుమారుడి మీద గంభీరమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రధానితో బండి సంజయ్ వేదిక పంచుకోవాల్సింది కాదు. ఆయన కేంద్ర హోంమంత్రిగా పదవిలో ఉంటే విచారణ సజావుగా సాగదు. కనుక విచారణ పూర్తయ్యే వరకు పదవి నుంచి తప్పుకోవాలి. సమస్యను ఏ పార్టీ వాళ్లు హైలెట్ చేసిన అది మంచిదే. కానీ ప్రభుత్వం దీనిపై స్పందించాలి. విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ ను తప్పించాలని ప్రధాని లెటర్ రాస్తాను. మోడీ, రేవంత్ రెడ్డి కలిసే ఉన్నారు. బడేభాయ్, చోటే భాయ్ కలిసే ఉన్నారు. అందుకే తెలంగాణకు ఇవ్వాల్సిన ప్రాజెక్ట్ లు రాకపోయినా ఆయన స్పందించటం లేదు. అందుకే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సీఎం కాదు, ఆర్ఎస్ఎస్ సీఎం అని నేను అంటాను. అమ్మతనంతో పాలన జరిగినప్పుడే సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుంది. అక్కగా కన్నా కూడా అమ్మగా ఆలోచిస్తే ఇంకా ఎక్కువ మంచి చేయవచ్చు. అందుకే నేను అక్క గా నుంచి అమ్మగా పరిణితి చెందాలని అనుకుంటున్నాను. మెంటల్లీ ఛాలెంజ్ పిల్లలకు ఈ ప్రభుత్వం కనీసం పెన్షన్ ఇవ్వటం లేదు. అలాంటి పిల్లల తల్లితండ్రులకు చాలా ఇబ్బందులు ఉంటాయి. అందుకే వాళ్ల కోసం మేము ప్రత్యేక కన్ సర్న్ చూపుతాం. కేర్ టేకర్స్ ను కూడా ఇస్తాం. ఆ విధంగా అమ్మగా ఆలోచిస్తే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. లీడర్‌ను ఎప్పుడూ కూడా జెండర్ బేస్డ్ గా చూడవద్దు. అన్ని వర్గాలు తనవే అని అనుకున్నప్పుడు మాత్రమే లీడర్ ఎదగగలడు.మన ఆలోచన విధానం మారితే అన్ని కూడా మారుతాయి. మనం లక్ష్యం పెద్దగా ఉండాలి. లీడర్ గా ఎదుగాలని అనుకుంటే సింహం గా ఆలోచించాలి. నాకు ఎన్టీఆర్, కేసీఆర్, ఇందిరాగాంధీ, సుష్మాస్వరాజ్, మార్గరేట్ థాచర్ ఇష్టమైన నాయకులు. జ్యోతి రావు పూలే కూడా నాకు చాలా స్ఫూర్తినిచ్చిన నాయకులు. నేను కూడా వాళ్ల మాదిరిగా గొప్ప నాయకురాలిగా ఎదగాలని అనుకుంటున్నా.

తమిళనాడులో విజయ్ గెలిచినట్లు తెలంగాణలో మేము కూడా గెలుస్తాం. మన రాష్ట్రంలో గొప్ప నాయకులు ఎవరు లేరు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన అన్ని మాటలు కూడా తప్పారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి వాళ్లు పార్లమెంట్ లో మన రాష్ట్రాన్ని అవమానిస్తున్న పట్టించుకోవటం లేదు. నేను చిన్ననాటి నుంచి కూడా ఎప్పుడు నిజమే చెప్పాలని నేర్చుకున్నా. ఆ నిజం కారణంగా నాకు నష్టం జరిగినా సరే నేను నిజమే చెబుతా. లిక్కర్ స్కామ్ పేరుతో బీజేపీ నన్ను కేజ్రీవాల్ బద్నాం చేయాలని చూసింది. అవినీతి పై పోరాటం చేసిన కేజ్రీవాల్ పై అవినీతి ఆరోపణలు చేసి ఆయనను ఇబ్బంది పెట్టింది. సాంస్కృతి, సాంప్రదాయాల కోసం పోరాటం చేసిన నన్ను లిక్కర్ స్కామ్ అంటూ బద్నాం చేశారు. కానీ కోర్టు ఆ ఆరోపణలను డిస్మిస్ చేసింది. పైగా విచారణ చేసిన సీబీఐ అధికారిపై విచారణ చేయాలని ఆదేశించింది. సీబీఐ అధికారిపై విచారణ చేయాలని చెప్పటం దేశంలోనే మొదటిసారి. లిక్కర్ స్కామ్ అంశం వచ్చినప్పుడు మా అమ్మ వాళ్ల నుంచి నాకు సరైన సపోర్ట్ రాలేదు. కానీ మా అత్త వాళ్ల కుటుంబం మాత్రం నాకు సపోర్ట్ చేసి ధైర్యం ఇచ్చింది. మన మీద ఎలాంటి ఆరోపణలు వచ్చిన సరే మన కుటుంబ సభ్యులు మనతో ఉంటే ఏదైనా సాధించవచ్చు. తెలంగాణ ప్రజలకు మర్చిపోలేనంత మంచి చేశానని చరిత్రలో నా పేరు ఉండాలన్నదే నా కోరిక. కవిత ప్రెస్ మీట్‌లో చెప్పడం జరిగింది

## ఆర్డిఓ నివాసం క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ ప్రతినిధి./మే 15/(జన సంఘర్షణ)



ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో బాన్సువాడలో నూతనంగా నిర్మించిన ఆర్‌డీఓ/సబ్ కలెక్టర్ నివాసం,క్యాంపు కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనం ద్వారా రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు. అధికారులు ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. బాన్సువాడ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు ఈ నూతన క్యాంపు కార్యాలయం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, జగిత్యాల అదనపు కలెక్టర్ రాజా గౌడ్, బాన్సువాడ ఆర్‌డీఓ ఎడ్ల రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్‌డీఓ, ఏఎంసీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హోటల్ సౌతేర్న్ సూట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం

- ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల జస్వంత్ రావు (దేశాల్), శేరి సతీష్ రెడ్డి.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల జస్వంత్ రావు (దేశాల్) శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెబీ కాలనీలో సీఈఓ చైర్మన్ శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోటల్ సౌతేర్న్ సూట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, బిజినెస్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్ రెడ్డి,మధు, రూబీన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కూకట్పల్లి నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలను ప్రజలకు తెలియజేయాలని, ఎంతోకాలంగా ఉంటున్న వారి ఓట్లను కూడా తొలగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతున్నారని ఇవన్నీ తిప్పి కొట్టేలా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఒక సైనికుల్లా పనిచేయాలని, తిరిగి మళ్ళీ ప్రజలు కేసీఆర్ నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని.. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని అభివృద్ధి వైపు ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజల్లో ఉంటూ ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ మేమున్నామని ధైర్యం బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు వారికి అందించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సాభియా గౌసుద్దీన్, పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, మహేశ్వరి శ్రీహరి, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల కఠిన చర్యలు..

- మూడు ట్రాక్టర్ల సీజ్..



భీమ్‌గల్/మే 15/(జన సంఘర్షణ)

ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు తమ నిఘాను పెంచారు. ఈ క్రమంలో ఎక్కడ అక్రమ ఇసుక తవ్వకాలు.. రవాణా జరుగుతుందని తెలిసినా తక్షణమే స్పందిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై, పోలీసులు తమ నిఘాను పెంచారు. ఈ క్రమంలో ఎక్కడ అక్రమ ఇసుక తవ్వకాలు.. రవాణా జరుగుతుందని తెలిసినా తక్షణమే స్పందిస్తున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు.

**గోన్‌గొప్పుల గ్రామ శివారులో.**

మండలంలోని గోన్‌గొప్పుల గ్రామ శివారులోని బోరపు వాగు వద్ద అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు, మెరుపు దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న భూఖ్య లక్ష్మణ్, భూఖ్య వకీల్, నాగారపు రాజు అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి వివరించారు. ప్రభుత్వ సంపదను దోచుకుంటూ అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

## కామారెడ్డి నాటు తుపాకితో కాల్చుకొని యువకుడు ఆత్మహత్య



కామారెడ్డి/మే 15,/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల్ మోతే గ్రామంలో ఓ యువకుడు నాడు తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తినిపితీయ ఇంద్రజిత్ సింగ్ (28) నాటు తుపాకితో కాల్చుకున్నట్టు స్థానికులు తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో మనస్థాపానికి గురైనట్టు ఇంద్రజిత్ ఈ ఘాతుపానికి పాల్పడినట్టు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆత్మకూర్‌లో ఆధ్యాత్మిక వైభవం

◆ శివాలయ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌కి ఘన సత్కారం



ఎల్లారెడ్డి నియోజకవర్గం/మే 15/(జన సంఘర్షణ)

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట్ మండల ఆత్మకూర్ గ్రామంలో నిర్వహించిన శివాలయం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కుంట రాఘవరెడ్డి మల్లికార్జున్‌ని ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో మల్లికార్జున్ పాల్గొని భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుక గ్రామంలో విశేష ఆకర్షణగా నిలిచింది.

## నిర్లక్ష్యపు కారు డ్రైవింగ్‌కు నిండు ప్రాణం బలి..



కోటగిరి/మే 15/(జన సంఘర్షణ)

డివైడర్‌ను కారు ఢీకొనగా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కోటగిరి, మండలం ఎత్తొండ శివారులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది.డివైడర్‌ను కారు ఢీకొనగా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కోటగిరి ,మండలం ఎత్తొండ క్యాంప్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది.

**అజాగ్రత్తగా కారు నడపడంతో..**

ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన యువకుడు ముత్తిపేట సాత్విక్ (19) మాశెట్టి ప్రతాప్ అనే వ్యక్తితో కారులో ఎత్తొండ వైపు వెళ్తున్నాడు. అయితే ఎత్తొండ క్యాంప్, అంబేద్కర్ విగ్రహం వద్దకు రాగానే డ్రైవర్? ప్రతాప్ అజాగ్రత్తగా కారు నడపడంతో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాత్విక్ తల, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని బోధన్?లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాత్విక్ గురువారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

## మలిదశ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్

బాన్సువాడ/మే 15/(జన సంఘర్షణ)




హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం ఇంటిముట్టడి కార్యక్రమానికి మలిదశ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో పోలీసులు పలువురిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం ఇంటిముట్టడి కార్యక్రమానికి మలిదశ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో పోలీసులు ముందస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

**ఉద్యమకారులను ఆదుకుంటామని చెప్పి..**

ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు తమ ఆశయాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఎం ఇల్లు ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జూన్ 2లోపు అమలు చేయాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ మరింత తీవ్రంగా ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్తా, మండల అధ్యక్షుడు గంజివార్ చందు, కాల్వ శ్యామ్, భాస్కర్ గౌడ్, ఎదుబాల్లే కృష్ణ, అగ్లవే దత్తు, గైని గంగారామ్, పల్లికొండ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల సమాఖ్య సారథిగా మందా నాగరాజు



బూర్గంపాడు మే 15 (జన సంఘర్షణ)

స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా సాగాల్సిన పంచాయతీ వ్యవస్థలో, అందరినీ కలుపుకుని పోయే నాయకత్వానికి పట్టాభిషేకం జరిగింది. బూర్గంపహాడ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మందా నాగరాజును శుక్రవారం భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 18 గ్రామ పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా మద్దతు తెలపడం నాగరాజు పనితీరుకు, ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం తన గ్రామానికే పరిమితం కాకుండా, మండలం మొత్తం మీద ఉన్న సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే 'గొంతుక'గా నిలవాలని ఆకాంక్షించారు. అధికారం కేవలం పూలమాలలు, సన్మానాలకు పరిమితం కాకూడదని, గ్రామ స్వరాజ్య స్థాపనలో సర్పంచులు ఎదుర్కొంటున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచినప్పుడే ఆ పదవికి సార్థకత లభిస్తుందని ఈ సన్మాన సభ గుర్తుచేసింది. ఈ కార్యక్రమంలో బిక్షం యాదవ్, మల్సూర్ యాదవ్ సహా పలువురు నాయకులు పాల్గొని, బాధ్యతాయుతమైన నాయకత్వం వైపు నాగరాజు వేసే అడుగులకు సంఘీభావం తెలిపారు.

# బండి సాయి భగీరథను అరెస్టు చేయాలి

◆ బండి సంజయ్ రాజీనామా చేయాలి.
◆ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఖండిద్దాం.
◆ సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ డిమాండ్.

హైదరాబాద్, మే 15 (జన సంఘర్షణ):

సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆర్టీసీ క్రాస్ రోడ్లో బండి సాయి భగీరథ్ ను అరెస్టు చేయాలనీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి రాజీనామా చేయాలనీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వ, పోలీసుల వైఖరిని ఖండించాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా నిర్వహించారు. అక్కడే చిన్నపాటి ప్రదర్శన నిర్వహించి క్రాస్ రోడ్లో నిరసన ధర్నా జరిపారు. సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. హన్మేశ్, టీయుసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ, మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు సదానందం, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు కె. స్వరూప, పీడీఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్. అనిల్ కుమార్, టీయుసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. ప్రవీణ్, కె.ఎస్. ప్రదీప్ లు ప్రసంగించారు.ఎం. హన్మేశ్, ఎస్.ఎల్. పద్మ, సదానందం మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడు భగీరథ్ మైనర్ బాలికను అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఆయన తప్పించుకు తిరగడం కాదు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ తప్పిస్తున్నారన్నారు. మే 8వ తేదీన కేసు పెడితే వారం గడిచినా అరెస్టు చేయక పోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు ఆందోళన చేస్తే తప్ప పోక్సో కేసును బుక్ చేయక పోవడం దారుణమన్నారు. మైనర్ బాలిక సాక్ష్యాలతో సహా కేసు పెడితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసును సిట్ ఏర్పాటు చేశారా? అని రేవంత్ ను ప్రశ్నించారు. బండి సంజయ్ మధ్యవర్తిత్వం చేసి, బాధితురాలిని, కుటుంబాన్ని భయపెట్టడం అన్యాయమన్నారు. ఒకపక్క కేసు బుక్ అయినా, ప్రధాని సభలో పునీతుడిలా మాట్లాడటం దారుణమన్నారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లు ఒకే తాను ముక్కలేనని స్పష్టం చేస్తున్నారన్నారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేవ భక్తి, దేశభక్తి జపం చేసే బండి సంజయ్ ముందుగా




రాజీనామా చేసి, కొడుకును స్టేషన్లో సరెండర్ చేసి దేశభక్తినీ, రాజ్యాంగానికి లోబడి వున్నానని నిరూపించుకోవాలన్నారు. మైనర్ బాలికను ఇబ్బంది కలగచేసేట్లుగా ప్రచారం చేయడాన్ని ఖండించారు. బండి భగీరథ గత విద్యార్థి చరిత్రను చూసి గ్రహించాలని ప్రభుత్వాన్ని, ప్రజలకు సూచించారు. ఈ ధర్నాలో పీఓడబ్ల్యు నాయకులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, నల్లన్న (టీయుసీఐ), కిరణ్ (భవన), పీవైఎల్ నాయకులు భీమేశ్, క్రిష్ణ, రవికుమార్, నాగలక్ష్మి, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పరామర్శ

జుక్కల్ నియోజకవర్గం/మే 15/(జన సంఘర్షణ)



ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు భూమయ్య మాతృమూర్తి కీర్తిశేషులు రూసేగం నాగవ్వ తేదీ-28-04-2026 నాడు మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగ్రామమైన శాంతాపూర్‌కి వచ్చి వారి కుటుంబానికి పరామర్శించడం జరిగింది. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ మాజీసర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రఫీ, గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు రాజా గౌడ్ నర్సా బోయి బాల బోయి, వార్డ్ నెంబర్ సాయిరాం, మాజీ వార్డ్ నెంబర్ బాలరాజు గౌడ్, డైరెక్టర్ హన్మాండ్లు, సాయిలు, రవి, యాదయ్య, లింగయ్య, సాయిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల అధ్యక్షులను, డైరక్టర్‌లను నియమించాలని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాని రాష్ట రైతు సంఘం నాయకుడు ధర్నా

బోధన్/మే 15/(జన సంఘర్షణ)




నామినేటెడ్ పద్ధతిలో సహకార సంఘాల అధ్యక్షులను, డైరక్టర్ లను నియమించాలని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాని, రాష్ట రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ ఆర్ డి వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, జిల్లాఉపాద్యక్షులు నాగళ్ల హన్మంతరావులు ప్రసంగిస్తూ సహాకార సంఘాలకు, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ నకిరేకల్/ మే 15/(జన సంఘర్షణ)

కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ధాన్యం తూకాలు, రైతులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే గారు, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలి. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు" అని స్పష్టం చేశారు. అనంతరం చిట్యాల పట్టణంలోని భాగ్యలక్ష్మి మిల్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం దిగుమతి కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం నిల్వ, రవాణా, దిగుమతి ప్రక్రియలను సమీక్షించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం" అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

◆ ప్రొ.రాబింద్రనాథ్ సోలమన్
◆ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జాబ్ మేళ

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు మే 15, (జన సంఘర్షణ):

డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో చదివే విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి నిర్దేశించిన విధంగా ముందుకు వెళ్ళుతున్నట్లు వీసీ ఓఎస్డీ ప్రొ. రబింద్రనాథ్ సోలమన్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. పి. వేణు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. "విద్యా వారోత్సవాల్లో" భాగంగా డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 9 ప్రఖ్యాత సంస్థలతో కలిసి శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. అంబేద్కర్ యూనివర్సిటీలో చదివి ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ "జాబ్ మేళ" నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సంస్థల్లో ఉద్యోగ కల్పన కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించామని, ఇందులో 102 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని, మరో వంద మందికి పైగా విద్యార్థులు ఫైనల్ రౌండ్ కి ఎంపిక అయ్యారని వివరించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ కోసం 3,000 మందికి పైగా నమోదు చేసుకోగా మొదటి విడుతలో 416 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా సంస్థల ప్రతినిధులు ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఇందులో ఇన్ఫినిక్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, వింగ్స్ ఇన్ఫోనెట్ ప్రైవేట్ లిమిటెడ్, రాక్‌వుడ్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, సెన్సేషనల్ అగ్రి ఇన్‌పుట్స్ ప్రైవేట్ లిమిటెడ్, సిస్కో ప్రైవేట్ లిమిటెడ్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, టీమ్ లీజ్, డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ వంటి తొమ్మిది సంస్థలలో ఐటీ, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టీచింగ్, మార్కెటింగ్ వంటి పలు రంగాలలో ఉద్యోగ నియామకాలు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రొ.పి.వెంకటరమణ; ప్రొ. చంద్రకళ, ప్రొ. రజనీ డా. రాధాకృష్ణ, డా. రాఘవేంద్ర, డా. రజిత, డా. పడాల లక్ష్మణ్, డా. సునీల్ పోతన తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శనివారం 16 మే 2026

# ఒంగోలులో దారుణం: లాడ్జిలో అంధురాలైన ప్రభుత్వ ఉద్యోగిని గొంతు కోసి హత్య..!!

- ఒంగోలులో దారుణం జరిగింది. ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న అంధురాలు ఆదిలక్ష్మి ఓ లాడ్జిలో హత్యకు గురైంది.

ఒంగోలు ప్రకాశం జిల్లా /మే 15/(జన సంఘర్షణ)

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని డిపో సెంటర్ సమీపంలో ఉన్న శ్రీరామ్ లాడ్జిలో ఓ మహిళ గొంతు కోసి హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు ఆదిలక్ష్మి అని, ఆమె అంధురాలని పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలక్ష్మి ఒంగోలులోని ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో భర్త మల్లికార్జున్ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఆదిలక్ష్మి వెంకటరమణ అనే వ్యక్తితో కలిసి డిపో సెంటర్ వద్ద ఉన్న శ్రీరామ్ లాడ్జిలో దిగినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని లాడ్జి గదిని తెరిచి చూడగా ఆదిలక్ష్మి రక్తపు మడుగులో మృతిచెందిన స్థితిలో కనిపించింది. ఆమె గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం మీడియాతో



మాట్లాడిన ఎస్పీ.. "భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేకంగా మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాం. లాడ్జిలో మహిళ మృతదేహం లభించింది. ఆమెతో కలిసి ఉన్న వెంకటరమణ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి" అని తెలిపారు. పోలీసులు లాడ్జి సిబ్బందిని ప్రశ్నిస్తూ, సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. హత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్,/ మే 15/(జన సంఘర్షణ)

పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు శ్రీ దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ , ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న




ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె ఇండ్లన్నిటికీ లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్‌గా తీసుకుని, లబ్ధిదారుల అసోసియేషన్‌ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా పథంలో ములుగు ఏసీపీ జన్మదినం

ఇల్లందు మే 15 (జన సంఘర్షణ)




పదవి కేవలం బాధ్యత మాత్రమే కాదు, సమాజంపై మమకారం కూడా అని ములుగు ఏసీపీ ఈ. కిషోర్ కుమార్ పుట్టినరోజు వేడుకలు నిరూపించాయి. ఆర్భాటాలకు పోకుండా, ఆడంబరాలకు దూరంగా, తోటి మనిషి కష్టంలో తోడుండటమే నిజమైన వేడుక అని చాటిచెబుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.నేషనల్ చైర్మన్ మహమ్మద్ మొహినుద్దీన్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా సంస్థ ప్రతిబింబించింది. ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి వేదికగా జరిగిన ఈ వేడుకలో, సుపరింటెండెంట్ హర్షవర్ధన్ సహా ఇతర వైద్య సిబ్బందిని సాదరంగా సత్కరించారు. నిరంతరం రోగుల సేవలో తరించే వైద్యులను గౌరవించడం ద్వారా, సమాజంలో వారి స్థానాన్ని మరోసారి గుర్తుచేసి సభ్యులు ఆదర్శంగా నిలిచారు.కేవలం కేక్ కటింగ్ వేడుకలకే పరిమితం కాకుండా, ఆసుపత్రిలోని రోగుల చెంతకు చేరి వారి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వారికి పండ్లు, శీతల పానీయాలను పంపిణీ చేసి ఊరటనిచ్చారు. అధికారం ఉన్న వ్యక్తి పుట్టినరోజును సామాన్యుల సేవతో ముడిపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశ్యం.. సాటి మనిషి పట్ల ఉండాల్సిన కనీస కనికరాన్ని అందరికీ గుర్తు చేయడమేనని ఈ సందర్భంగా ప్రతిధ్వనించింది.ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి రాధాగోవిందు, జిల్లా నేతలు సతీష్, సత్యం, శంకర్, మహిళా విభాగం నేతలు శిరీష, వైశాలి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒక అధికారి పుట్టినరోజును సామాజిక సేవా దినోత్సవంగా మార్చిన ఈ తీరు, రేపటి సమాజంలో ఇలాంటి ఎందరో అధికారులకు, సంస్థలకు ఒక దిశానిర్దేశంలా నిలిచింది. నిజమైన పుట్టినరోజు అంటే తన కోసం తాను జరుపుకునేది కాదు, పదిమంది ముఖాల్లో చిరునవ్వు నింపేదని ఈ కార్యక్రమం ఆలోచింపజేసింది.

# వ్యవస్థను నిలదీసే యువ కెరటం.. ప్రజా పక్షపాతి 'సురేష్'కు జన్మదిన శుభాకాంక్షలు

- విధేయతకు మారుపేరు.. హరిప్రియమ్మ నమ్మిన బంటు 'సురేష్'

ఇల్లందు మే 15 (జన సంఘర్షణ)



రాజకీయం అంటే వ్యాపారంగా మారిపోయిన నేటి కాలంలో, నమ్మిన సిద్ధాంతం కోసం, అభిమానించే నాయకురాలి కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం. ఆ కోవలోకే వస్తారు బిఆర్ఎస్ యువ నాయకుడు సురేష్. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ వెన్నంటి ఉంటూ, ఆమె అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఆర్థికంగా సామాన్య స్థితిలో ఉన్నప్పటికీ, పార్టీ కోసం మరియు ప్రజల కోసం ఖర్చుకు వెనుకాడకుండా తనకున్నంతలో సేవలు అందిస్తూ, "నిజమైన నాయకత్వానికి ధనం కాదు, మనసు ముఖ్యం" అని సురేష్ నిరూపిస్తున్నారు. వ్యవస్థలోని లోపాలను వేలెత్తి చూపడంలో సురేష్ శైలి ప్రత్యేకం. "పిట్ట కొంచెం కూత ఘనం" అన్న చందంగా, ప్రజా సమస్యలపై ఆయన స్పందించే తీరు, అధికారులను నిలదీసే ధైర్యం చూస్తుంటే భవిష్యత్తులో ఒక గొప్ప నాయకుడి లక్షణాలు ఆయనలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. హరిప్రియ నాయక్ గారి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి సామాన్యమైనది కాదు. ఆశయ సాధనలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఆర్థిక ఇబ్బందులు అడ్డువచ్చినా వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్న ఆయన పట్టుదల యువతకు స్ఫూర్తిదాయకం. నేడు సురేష్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, స్నేహితులు, పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకోవడం కంటే, జనం గుండెల్లో స్థానం సంపాదించడమే పరమావధిగా భావించే సురేష్ వంటి యువ నాయకులు రాజకీయాల్లోకి రావడం శుభపరిణామం. ప్రశ్నించే గొంతుకగా, పేదల పక్షపాతిగా ఆయన రాజకీయ ప్రస్థానం మరిన్ని విజయాలతో సాగాలని, హరిప్రియమ్మ ఆశీస్సులతో ఆయన ప్రజలకు మరింత సేవ చేసే స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశిద్దాం.

# హరిత నిధి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలి

- మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/మే 15/(జన సంఘర్షణ)



హరిత నిధి 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గతంలో మంజూరైన ప్రాజెక్టుల అమలు పురోగతిని మంత్రి సమీక్షించగా, పలు కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు.నర్సరీల ఏర్పాటు, అర్బన్ పార్కుల అభివృద్ధి, అటవీ సంరక్షణ, అటవీ పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, ఎకోటూరిజం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం లభించింది.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు హరిత నిధి కీలక వేదికగా పనిచేస్తోందన్నారు. అడవుల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ప్రాజెక్టు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో పాటు కొత్తగా మంజూరైన ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేసి, పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. అటవీ సంపదను కాపాడడం, జీవ వైవిధ్య పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి హరిత నిధి లక్ష్యాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# అధికార గర్వమా? అమానుషత్వమా? బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి




కామేపల్లి మే 15 (జన సంఘర్షణ)

చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అన్న మాటలు కేవలం సామాన్యులకేనా? అధికార పీఠంపై ఉన్నవారికి అవి వర్తించవా? అని ప్రగతిశీల యువజన సంఘం (ర్హా) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్ సంధించిన ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది. కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడితే, ప్రభుత్వం విచారణ పేరుతో కాలయాపన చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. కామేపల్లిలో జరిగిన నిరసన ప్రదర్శనలో నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని చట్టం నుండి తప్పించుకోవాలని చూడటం బాధితురాలిని మరోసారి అవమానించడమేనని మండిపడ్డారు. తక్షణమే 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేసి, బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని, లేనిపక్షంలో ఈ పోరాటం సెక్రటేరియట్ మెట్లు తొక్కే వరకు ఆగదని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బాధితురాలికి న్యాయం జరగని నాడు, వ్యవస్థపై సామాన్యుడికి నమ్మకం ఎక్కడి నుంచి వస్తుంది? ప్రభుత్వం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందో లేక బాధితురాలి కన్నీరు తుడుస్తుందో వేచి చూడాలి.

# బండి సాయి భగీరథను అరెస్టు చేయాలి

- యువజన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్ర వీరన్న.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి అంజిబాబు, మే 15 (జన సంఘర్షణ):



తెలంగాణ జన సమితి పార్టీ ఆదేశాల మేరకు యువజన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్రవీరన్న బండి సాయి భగీరథ పై కేస్ పై మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి బేటి బచావో బేటి పడావో గొప్ప మాటలు చెప్పి భారతమాతకు జై నిత్యం పలుకుతు ఎలాంటి దేశాన్ని తయారు చేస్తుంది. ఎలాంటి ధర్మాన్ని నిలబెడుతుంది ఈ దేశాన్ని తల్లితో పోల్చి దేశ ప్రజలను మభ్యపెడుతుందని బండి సాయి భగీరథ విషయంలో అర్థమవుతుంది మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా మేజర్ అని నిరూపించడానికి దొంగ పత్రాలను సృష్టించే అవసరం ఎందుకు వచ్చిందనీ అన్నారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తున్న పోలీస్ యంత్రాంగం ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడానికి రాజకీయ ఒత్తిడిలే కారణమని భావిస్తున్నామని అని అన్నారు. ఈ కేసు విషయంలో పోలీసు యంత్రాంగం ప్రజా వ్యతిరేకతను అపనమ్మకాన్ని పోగు చేస్తుందని గుర్తు చేశారు. ప్రజలకు కోర్టుల మీద నమ్మకం పోయిందని బిజెపి నాయకులు మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే విచారణకు సహకరించాలని బండి సాయి భగీరథ తండ్రి బండి సంజయ్ ఈ కేసు విషయంలో నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని అన్నారు. మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు వ్యవస్థలపై ఒత్తిడి తీసుకొచ్చేలా తెలంగాణ జన సమితి పార్టీ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు.

# గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

**ఉప్పల్ :**



గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బన్నాల గీత, ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక విద్యా వార్షికోత్సవాల్లో భాగంగా 11 తేదీ నుండి 17 తేదీ వరకు జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బన్నాల గీత గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ పాఠకులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బన్నాల గీత మాట్లాడుతూ ఉప్పల్ బీరప్పగడ్డ ప్రాంతంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించామని తెలిపారు. గ్రూప్స్కు సిద్ధమవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# మోడీది డబుల్ ఇంజన్ సర్కార్ కాదు..

**-రెండు నాలుకల సర్కార్: జక్క వెంకట్ రెడ్డి**

**పీర్జాదిగూడ :**




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో నడుస్తున్న ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, "రెండు నాలుకల సర్కార్" అని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికలు ముగిసిన తర్వాత మరోలా వ్యవహరించడం బీజేపీ ప్రభుత్వ వైఖరిగా మారిందని ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్ ధరలు పెంచి దేశ ప్రజలను మరోసారి బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్కు ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు యుద్ధ పరిస్థితులను కారణంగా చూపడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఎంపీలుగా గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ గతంలో పలుమార్లు పెట్రోల్ ధరలు పెరగవని చెప్పారని, ఇప్పుడు ధరలు ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్పై పన్నులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే ప్రజలపై భారం పడదని కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, సీతక్క చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా పెరిగిన ధరలను ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనలో ప్రధానమంత్రి మోదీ పెట్రోల్, డీజిల్ తక్కువగా వాడాలని, బంగారం కొనొద్దని, నూనె తక్కువ వాడాలని చెప్పినప్పుడే ప్రజలకు అనుమానం వచ్చిందని జక్క వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా జనగీతిక పుస్తకావిష్కరణ

**లోకకవి డాక్టర్ అందెశ్రీ స్మృతికి 67 మంది కవుల అక్షరాంజలి**



**కూకట్పల్లి :**

లోకకవి డాక్టర్ అందెశ్రీ సాహిత్య సేవలను స్మరించుకుంటూ 67 మంది కవులు రచించిన కవితా సంకలనం 'జనగీతిక' పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. సాహిత్య, సాంస్కృతిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం కవులు, రచయితలు, కళాకారుల సమక్షంలో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి ఏవో డాక్టర్ పి విజయ్ కుమార్ 'జనగీతిక' సంకలన సంపాదకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, తొలి ప్రతి స్వీకర్త ప్రముఖ కవి రేడియం, సినీ గేయ రచయిత మౌనశ్రీ మాలిక్, సినీ దర్శకులు నామల రవీంద్ర సూరి, ప్రముఖ గాయకులు దేవత సుధాకర్, కవి--రచయిత మిద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అందెశ్రీ సాహిత్యం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత కవిని స్మరిస్తూ కవులు అక్షరాంజలిగా ఈ సంకలనాన్ని వెలువరించడం అభినందనీయమని కొనియాడారు. 'జనగీతిక'లోని కవితలు అందెశ్రీ ఆలోచనా ప్రపంచాన్ని, ప్రజాస్వామ్య భావజాలాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.

# శనిగరం గ్రామంలో 30 సీసీ కెమెరాల ప్రారంభం

**-ముఖ్య అతిథిగా అదనపు డీసీపీ కుషాల్కర్ హాజరు**

**సిద్దిపేట:**



సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామ పంచాయతీ పరిధిలో 'సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను అదనపు డీసీపీ కుషాల్కర్ శుక్రవారం ప్రారంభించారు. వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆర్థిక సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ కుషాల్కర్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో అధునాతన సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు. వీటి ద్వారా గంజాయి, రేషన్ బియ్యం వంటి అక్రమ రవాణాపై నిఘా ఉంచడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికిన ఆయన, పిల్లలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్ను సంప్రదించాలని సూచించారు. సామాజిక బాధ్యతగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్, గ్రీన్వేస్ బయో ఎనర్జీ సంస్థల ప్రతినిధులను అదనపు డీసీపీ అభినందించారు. కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇతర గ్రామాల్లో కూడా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, కోహెడ ఎస్సై అభిలాష్, స్థానిక ఎస్సై, గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, ఉప సర్పంచ్ పెరుక బుచ్చయ్య, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న బిజెపి ప్రభుత్వం

**-పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను కేంద్రం నియంత్రించాలి**

**-సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**-హనుమకొండలో సీపీఐ వినూత్న నిరసన**

**హనుమకొండ :**



పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రో ధరల పెంపుతో రవాణా, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పది రోజుల క్రితం వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్ ధరలను భారీగా పెంచి కనికరం లేకుండా సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించని ఎడల ప్రజా గ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి. విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

**-సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్**

**-హనుమకొండ కాళోజీ సెంటర్ లో సిపిఐ రాస్తారోకో**

**హనుమకొండ :**




పోక్సో కేసులో తన కొడుకును రక్షించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కాళోజీ సెంటర్ లో సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, ఇటీవల 17 ఏళ్ల మైనర్ బాలికపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ మద్యం తాగించి, కొన్నిసార్లు డ్రగ్స్ ఇచ్చి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు పెట్టడం జరిగిందని అన్నారు. బండి సంజయ్ తన కుమారున్ని రక్షించుకొనే ప్రయత్నం చేస్తూ కేసును నిరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి భగీరథ ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తండ్రి హోం సహాయ మంత్రిగా ఉండడం వలన పోలీసు యంత్రాంగాన్ని ప్రధాన మీడియాను మేనేజ్ చేస్తూ కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వెంటనే బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేస్తే కేసును నిష్పక్షపాతంగా నమోదు కావడానికి అవకాశం ఉంటుందని డిమాండ్ చేసినారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి. విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండి భగీరథను కాపాడేది రాష్ట్ర ప్రభుత్వమే

**-మైనర్ బాలికకు న్యాయం చేయాలి**

**-భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి: బన్నాల గీత**

**ఉప్పల్ :**



బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో ఇప్పటికీ అరెస్ట్ చేయకపోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో ట్యాంక్బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బన్నాల గీత, మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథపై పోక్సో కేసు నమోదై ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుడిని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా రాష్ట్ర హోంమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాపాడేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇదే స్థానంలో సామాన్య వ్యక్తి ఉండి ఉంటే ఇంత ఆలస్యం జరిగేదా అని ప్రశ్నించారు. మైనర్ బాలికకు న్యాయం జరిగేలా బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి, సిట్ విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అరెస్ట్ జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
16 మే 2026

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్ :**
పాత హబ్సిగూడ డివిజన్ ఆధ్వర్యంలో ఇందిరా ఎంపిరియల్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణను మరింత విస్తరించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, యువ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుమ్మల నాగేశ్వరావును మర్యాదపూర్వం కలిసిన పంచాయతీ పాలకవర్గం



**అన్నపురెడ్డిపల్లి :**
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాలుగు దశాబ్ద కాలాల రాజకీయ చరిత్రను పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శుక్రవారం అన్నపురెడ్డిపల్లి పంచాయతీ పాలకవర్గం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు సుగ్గల నరసింహారావు, చల్లా రమేష్, తదితరులు ఉన్నారు.

## సిపిఐ మండల ముఖ్య నాయకుల సమావేశం నూతన ఆర్గనైజర్ ఎన్నిక...

**మండల పార్టీ ఆర్గనైజర్ గా మోరంపూడి నాగేశ్వరరావు**

**పార్టీ సభ్యత్వాలు అభివృద్ధిపై చర్చ**



**అన్నపురెడ్డిపల్లి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామంలో సిపిఐ మండల ముఖ్య సమావేశం శుక్రవారం అన్నపురెడ్డిపల్లి లో సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి షాబీర్ పాషా, ఆధ్వర్యంలో జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో కార్యకర్తలు మీడియా మిత్రులు పాల్గొన్నారు, సమావేశం ముఖ్య ఉద్దేశం పార్టీ యొక్క సభ్యత్వాలు నూతన ఆర్గనైజర్ ఎన్నికను ఉద్దేశించి సమావేశాన్ని ఏర్పాటు చేసి. యొక్క మండలానికి అధిక బాధ్యతను తీసుకొని మండలంలోని పార్టీని బలోపేతానికి కృషిచేసి సమిష్టి కలివిడిగా పార్టీ అభివృద్ధిని సాధించి బూజీవ పార్టీల కంటే మీన్నగా పార్టీ అభివృద్ధి సాధించాలని జిల్లా పార్టీ కార్యదర్శి షాబిర్ పాషా నూతన పాత మండల నాయకత్వానికి సూచించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల సిపిఐ ఆర్గనైజర్ మోరంపూడి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఓకే నారాయణ, సహాయ కార్యదర్శి పలగాని రామకృష్ణ, చంద్రుగొండ సిపిఐ మండల అధ్యక్షుడు బొర్రా కేశవులు, జిల్లా పార్టీ సభ్యులు జడ శీను, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి ;**
కూకట్పల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్న వేళ, శుక్రవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను సైతం తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతోందని, అలాంటి పరిస్థితులను ప్రజల్లో ఎండగట్టే బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు మాజీ మె కేసీఆర్ నాయకత్వం వైపు ప్రజలు మళ్లీ ఆశతో చూస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, ఇకనైనా ప్రజా సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, "మేమున్నాం" అనే ధైర్యాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందించాలని ఆయన కోరారు. త్వరలోనే కూకట్పల్లి నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో కూకట్పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సాభియా గౌసుద్దీన్, పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్,



మహేశ్వరి శ్రీహరి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్లో సర్వీస్ రోడ్డు పూర్తి పనులకు వేగం

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాలతో అధికారులు రంగంలోకి**

**-షాపు యజమానులు,వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో త్వరలోనే రోడ్డు పనుల పూర్తి**

**కూకట్ పల్లి:**
శేర్లింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే, పి.ఎ.సి చైర్మన్ అరికెపూడి గాంధీ వివేకానంద నగర్ డివిజన్లో పెండింగ్లో ఉన్న సర్వీస్ రోడ్డు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. ఈ నేపథ్యంలో వివేకానంద నగర్ మెయిన్ రోడ్డులోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రిసిటీ శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యక్షంగా పర్యటించారు. రోడ్డుపై అడ్డంకిగా ఉన్న విద్యుత్ పోల్స్, నేమ్ బోర్డులు, ముందుకు వచ్చిన షెడ్లు, పైపులను తొలగించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పిలుపుకు స్పందించిన స్థానిక షాపు యజమానులు తమ షాపుల ముందున్న బోర్డులు, పైపులు తొలగించి రోడ్డు పనులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని, మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుకు బాటులోకి



తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ మధు, ఎలక్ట్రిసిటీ ఏఈ చైతన్య, ట్రాఫిక్ సీఐతో పాటు వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి. నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, కిషోర్, జి. ప్రసాద్, వెంకటేశ్వరరావు, కె.వి.రావు, కొండారెడ్డి, డి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షులు జై పురేందర్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సప్తగిరి కాలనీలో సేవా స్ఫూర్తి చాటిన చలివేంద్రం

**-ప్రజలకు మజ్జిగ,పండ్లు,మంచినీరు పంపిణీ చేసిన ఎంసీఆర్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు**

**కూకట్ పల్లి/ ప్రజావారధి:**
కూకట్పల్లి నియోజకవర్గంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ రామాలయం దేవాలయం ముందు ఉన్న ఎంసీఆర్ కాంప్లెక్స్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలను ఆకట్టుకుంది. ఎంసీఆర్ కాంప్లెక్స్ అధ్యక్షులు అభిలాష్ రెడ్డి, స్వాతి దంపతులు ఆధ్వర్యంలో ఈ చలివేంద్రంలో ప్రజలకు చల్లని మంచినీరు, మజ్జిగతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి హాజరై చలివేంద్రం వద్దకు వచ్చిన ప్రజలకు స్వయంగా మజ్జిగ, పండ్లు,




మంచినీరు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా భావంతో ముందుకు వచ్చిన అభిలాష్ రెడ్డి – స్వాతి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జె. పురేందర్ రెడ్డి కమిటీ సభ్యులు జి. ప్రసాద్, లక్ష్మీనారాయణ, కొండా రెడ్డి, వైవి రావు, నర్సింగ్ రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొని మజ్జిగ, పండ్ల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. అలాగే ఎంసీఆర్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జయలక్ష్మి, స్వాతి, శివప్రసాద్, రవి రెడ్డి, సురేష్ బాబు, శ్రావణి తదితరులు సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కమిటీ సభ్యుడిని జై పురేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వేసవి వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా నిర్వహించిన ఈ చలివేంద్రం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.

## బాలానగర్ మెట్రో సమీపంలో గంజాయి రవాణా గుట్టురట్టు

**907 గ్రాముల గంజాయి స్వాధీనం.యువకుడు అరెస్ట్**



**కూకట్ పల్లి .:**
కూకట్పల్లి పోలీసుల అప్రమత్తతతో బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయానికి సంబంధించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నమ్మదగిన సమాచారంతో కూకట్పల్లి పోలీస్ స్టేషన్కు చెందిన ఎస్.ఐ వి. తుకారాం ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని మెట్రో పిల్లర్ నెం. 863 వద్ద ఖాళీ ప్రదేశంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ గంజాయి విక్రయానికి ప్రయత్నిస్తున్న మాదరబోయిన సాయి కుమార్ (24) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతని వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 907 గ్రాముల గంజాయి మరియు ఒక మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన పూర్ణచంద్ర అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తెచ్చుకొని, అధిక ధరలకు తనకు పరిచయం ఉన్న సాయి కృష్ణ మరియు టక్కు అనే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కూకట్పల్లి పోలీసులు ఎన్ డి పీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్కు తరలించారు. నగరంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co